శుభాకాంక్షలు

క్రిష్టినా జడ్ చోంగ్తూ,మొక్కను అందజేస్తున్న కలెక్టర్ మనుచౌదరి

సంజయ్ కుమార్‌తో కరచాలనం చేస్తున్న కలెక్టర్

సిద్దిపేట కలెక్టరేట్ , నవంబర్ 20 : రాష్ట్ర వైద్య , ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిష్టినా జడ్ చోంగ్తూ, రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన, శిక్షణ అండ్ ప్యాక్టరీస్ ప్రిన్సిపల్ సెక్రటరీ సంజయ్ కుమార్‌లను బుధవారం కలెక్టర్ కలిశారు. హరిత మినర్వా హోటల్‌లో కలెక్టర్ మనుచౌదరి వేర్వేరుగా మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయా శాఖల గురించి కాసేపు చర్చించారు.

ప్రభుత్వ దవాఖానలో న్యాయ విజ్ఞాన సదస్సు

సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి స్వాతి రెడ్డి

సిద్దిపేట, నవంబర్ 20 : ప్రతి ఒక్కరికీ ఉచిత న్యాయం అందించేందుకు న్యాయ సేవాధికార సంస్థ కృషి చేస్తుందని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ, న్యాయమూర్తి స్వాతి రెడ్డి అన్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ దవాఖానలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. అనంతరం దవాఖానలో వైద్యులకు సిబ్బందికి పలు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చట్టాలపై అవగాహన కల్పించేందుకు న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. పోలీస్ స్టేషన్‌కు, కోర్టుకు, వెళ్లలేని వారి కోసం టోల్ ఫ్రీ నెంబర్ 15100 ఏర్పాటు చేశామని, ఈ నెంబర్‌కు కాల్ చేసి ఉచితంగా న్యాయ సలహాలు పొందవచ్చునని తెలిపారు. ఉచిత న్యాయం కోసం జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ప్రజలకు కల్పిస్తున్న అన్ని సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఇచ్చిన హామీలు మరిచి ప్రగల్భాలా..

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

సిద్దిపేట/చిన్నకోడూర్ నవంబర్ 20 : రేవంత్ రెడ్డి నువ్వు సీఎం అయినంత మాత్రాన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను విమర్శించే స్థాయి నీది కాదని గుర్తుంచుకోవాలని బీఆర్ఎస్ నాయకుడు జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్ అన్నారు. బుధవారం సిద్దిపేటలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నాయకులు కుంభాల ఎల్లారెడ్డి, సాయి గౌడ్ లతో కలిసి మాట్లాడారు. 10 ఏండ్లు పోరాటం చేసి తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేయకుంటే నువ్వు ముఖ్యమంత్రివి అయ్యేవాడివా ? రేవంత్ రెడ్డి అని ప్రశ్నించారు. కేసీఆర్ మొక్క కాదని ఆయన మహావృక్షమని ఆ వృక్షం యొక్క కొమ్మను కూడా నువ్వు తాకలేవన్నారు. ఇచ్చిన హామీలు మర్చిపోయి ఇప్పుడు ప్రగల్భాలు పలుకుతున్నారా అని ఎద్దేవా చేశారు.

ఆర్టీసీ కార్మిక సంఘాలపై ఆంక్షలు ఎత్తివేయాలి

సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కాముని గోపాలస్వామి

ఆర్టీసీ బస్ డిపో ఎదుట ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

సిద్దిపేట, నవంబర్ 20 : ఆర్టీసీ కార్మిక సంఘాలపై విధించిన ఆంక్షలను తక్షణమే ఎత్తివేసి గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కాముని గోపాలస్వామి అన్నారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం సిద్దిపేట ఆర్టీసీ డిపో ఎదుట ధర్నా నిర్వహించారు. పెరిగిన పని భారం మూలంగా మహిళలను కూడా అర్ధరాత్రి వరకు డ్యూటీలు చేస్తున్నారన్నారు. రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఆర్టీసీలో యూనియన్ కార్యకలాపాలకు అనుమతిస్తామని, కాంగ్రెస్ పార్టీ కార్మికులకు హామీ ఇచ్చింది. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాళ్ల బండి శశిధర్, ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి శిరీష, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవికుమార్, జిల్లా కమిటీ సభ్యులు మండల భాస్కర్, జిల్లా నాయకులు చిట్కూరి సుధాకర్, ప్రభాకర్, శ్రావణ్, ఎస్ఎఫ్ఐ నాయకుడు సంజీవ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఎల్వోసీ అందజేత

బాధిత కుటుంబ సభ్యులతో శాసనమండలి వైస్ చైర్మన్ బండ ప్రకాశ్

కొమురవెల్లి, నవంబర్ 20 : మండలంలోని ఐనాపూర్‌కు చెందిన కుక్కల రాజు అనారోగ్యంతో హైదరాబాద్‌లో ఒక ప్రైవేటు దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. బాధితుడికి మంజూరైన రూ.2 లక్షల ఎల్వోసీని శాసనమండలి వైస్ చైర్మన్ బండ ప్రకాశ్ కుటుంబ సభ్యులకు అందజేశారు. నాయకులు తేలు ఇస్తారి, పోడిశెట్టి నర్సింహులు, పిట్ల శ్రీనివాస్, కృష్ణ, చంద్రం తదితరులు ఉన్నారు.

సాగు నీరు వస్తే రైతులకు మేలు : ఆర్డీవో

సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో రాంమూర్తి

కోహెడ, నవంబర్ 20 : కాల్వల ద్వారా సాగు నీరు వస్తే రైతుల పంటలకు నీరు వచ్చి మేలు జరుగుతుందని ఆర్డీవో రాంమూర్తి అన్నారు. బుధవారం మండలంలోని బస్వాపూర్‌లో రంగనాయకసాగర్ ఎల్‌డీ6 కాల్వ నిర్మాణం ద్వారా భూమి కోల్పోతున్న రైతులతో అవగాహన కల్పించారు. ఏసీపీ సతీష్‌కుమార్, ఇన్‌చార్జి తహసీల్దార్ దేవేంద్ర, ఇరిగేషన్ అధికారులు, స్థానిక నాయకులు కొక్కుల రమేశ్,తదితరులు పాల్గొన్నారు.

ఓటమి గెలుపునకు నాంది..

జిల్లా విద్యాధికారి ఎల్లంకి శ్రీనివాస్‌రెడ్డి

కొండపాక(కుకునూరుపల్లి), నవంబర్ 20 : ఓటమి గెలుపునకు పునాది అని జిల్లా విద్యాధికారి ఎల్లంకి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం కొండపాక మండల కేంద్రంలోని బాలికల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు విటల్‌నాయక్ అధ్యక్షతన జరిగిన అభినందన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఓటమి రుచి చూసినప్పుడే గెలుపు ద్వారా వచ్చే ఆనందాన్ని సంపూర్ణంగా అనుభవిస్తామన్నారు. ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి, కాంప్లెక్స్ హెచ్‌ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల సమస్యలు పరిష్కరించాలి

డైరెక్టర్‌కు వినతి పత్రాన్ని అందిస్తున్న పంచాయతీ కార్యదర్శులు

మద్దూరు(ధూళిమిట్ట)/ జగదేవ్‌పూర్,నవంబర్ 20 : గ్రామ పంచాయతీ కార్యదర్శులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తెలంగాణ పంచాయతీ సెక్రటరీస్ ఫెడరేషన్ (టీపీఎస్ఎఫ్) ఆధ్వర్యంలో బుధవారం పంచాయతీ రాజ్ డైరెక్టర్ సృజనను పలువురు పంచాయతీ కార్యదర్శులు హైదరాబాద్‌లో కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. పంచాయతీరాజ్ డైరెక్టర్‌గా ఇటీవల నూతనంగా నియమితులైన సృజనను పంచాయతీ కార్యదర్శుల బృందం మర్యాదపూర్వకంగా కలిసి తమ సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. టీపీఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగరాజు, కోశాధికారి శశిధర్‌గౌడ్, వైస్‌ప్రెసిడెంట్ ఆకారపు సురేశ్, సిద్దిపేట, కామారెడ్డి జిల్లాల అధ్యక్షులు సంతోశ్, మహేశ్, సిద్దిపేట జిల్లా కోశాధికారి రాజుగౌడ్ ఉన్నారు.

డిసెంబర్ 10 లోగా ప్రణాళికలు సిద్ధం చేయాలి

కలెక్టర్ మనుచౌదరి

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేట కలెక్టరేట్, నవంబర్ 20 : డిసెంబర్ 10 లోగా జిల్లా వాటర్, శానిటేషన్ ప్రణాళికను సిద్ధం చేయాలని కలెక్టర్ మను చౌదరి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా నీరు,పారిశుధ్య మిషన్ కమిటీ సమావేశం కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని ప్రజలందరికి స్వచ్ఛమైన తాగునీరు, పరిశుభ్రమైన పరిసరాలను అందిచాల్సిన అవసరం ప్రభుత్వానికి ఉందన్నారు. కమ్యూనిటీ టాయిలెట్స్ నిర్మించి జిల్లాను బహిరంగ మల, మూత్ర విసర్జన రహిత జిల్లాగా చేయాలని సూచించారు. గ్రామ పారిశుధ్య కమిటీలు చురుగ్గా వ్యవహరించేలా చూడాలని డిసెంబర్ 10 లోగా నీరు, పారిశుధ్య యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలన్నారు. అనంతరం జిల్లా న్యూట్రిషన్ కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. పోషణ్ అభియాన్ కార్యక్రమం ద్వారా బాలలకు, గర్భిణులకు పౌష్టికాహారం అందేలా చూడాలన్నారు. అవసరమైన పిల్లలను ప్రభుత్వ జనరల్ దవాఖానలో గల న్యూట్రిషన్ రిహాబిలిటేషన్ సెంటర్లో ఉంచి సేవలందించాలన్నారు. డీఆర్డీవో జయదేవ్, డీడబ్ల్యూ శారద, డీపీవో దేవకీదేవి, డీఈవో శ్రీనివాస్‌రెడ్డి పంచాయతీరాజ్ ఈఈలు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రయాణికుల భద్రతకు అభయ యాప్

పోలీస్ కమిషనర్ డాక్టర్ అనురాధ

జెండా ఊపి ప్రారంభిస్తున్న సీపీ

సిద్దిపేట కలెక్టరేట్, నవంబర్ 20 : ప్రయాణిల భద్రతకు అభయ యాప్ ఉపయోగపడుతుందని సిద్దిపేట పోలీస్ కమిషనర్ డాక్టర్ అనురాధ తెలిపారు. బుధవారం సిద్దిపేట పోలీస్ కమిషనరేట్‌లో అభయ యాప్‌ను ఏసీపీ మధుతో కలిసి ప్రారంభించారు. ఆటో డ్రైవర్లకు అభయ యాప్ స్టిక్కర్లను అందజేశారు. అనంతరం జండా ఊపి సీపీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్ర యాణికుల,మహిళల రక్షణ కోసం ఆటో డ్రైవర్లకు అభయ యాప్ క్యూఆర్ కోడ్ పేపర్లను అందజేశామన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 1250 ఆటోలకు అభయ యాప్ స్టిక్కర్లను వేశామన్నారు. మిగతా ఆటోలకు త్వరలో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఆటోలో సురక్షితంగా ప్రయాణిస్తున్నామనే నమ్మకం ప్రయాణికులకు కలిగించాల్సిన బా ధ్యత డ్రైవర్లదేనన్నారు. ఆటోలో ప్రయాణిస్తున్న సమయంలో మహిళలకు ఏవైనా ఇబ్బందులు ఎదురైతే తమ మొబైల్ ఫోన్ నుంచి క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయగానే ఆటో పూర్తి వివరాలు పోలీసులకు తెలుస్తాయని, దీని వల్ల ఘటనా స్థలానికి పోలీసులు వెంటనే వెళ్లడానికి అవకాశం ఉంటుందన్నారు. యాప్ స్కాన్ చేయడం ద్వారా ఆటో డ్రైవర్ వివరాలతో పాటు ఆటో ప్రయాణించే మార్గం పూర్తి వివరాలు కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు వెళుతాయన్నారు. కార్యక్రమంలో ఏసీపీ మధు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్, సీఐలు, ఎస్సైలు పోలీస్ అధికారులు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

ఉన్నతమైన ఆశయాలతో ముందుకు సాగాలి

ఎమ్మెల్సీ సురభి వాణిదేవి

జ్యోతిప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్సీ వాణిదేవి

గజ్వేల్, నవంబర్ 20 : విద్యార్థి దశ నుంచే ఉన్నతమైన ఆశయాలను ఏర్పర్చుకొని వాటి ఆశయ సాధనలో ముందుకు సాగాలని ఎమ్మెల్సీ సురభి వాణిదేవి అన్నారు. మండల పరిధిలోని రిమ్మనగూడలోని సురభి దయాకర్‌రావు ఫార్మసీ కళాశాలలో నిర్వహించిన ఓరియెంటేషన్ కార్యక్రమానికి విచ్చేసిన సందర్భంగా ఆమె మట్లాడారు. తల్లి దండ్రులు కన్న కళలను సాకారం చేయడానికి విద్యార్థులు కృషిచేయాలన్నారు. ప్రిన్సిపాల్ వెంకటరమణ, వైస్ ప్రిన్సిపాల్ గణేశ్, డాక్టర్ స్వామి, నరేశ్ రెడ్డి, సౌందర్య, సౌమ్య, పూజిత తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి నెట్ బాల్ పోటీలకు బేగంపేట విద్యార్థి ఎంపిక

రాయపోల్, నవంబర్ 20 : రాష్ట్ర స్థాయి నెట్ బాల్ పోటీలకు రాయపోల్ మండలంలోని బేగంపేట గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన రామ్‌చరణ్ ఎంపికైనట్లు బుధవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు అంజిరెడ్డి తెలిపారు. తమ పాఠశాలకు విద్యార్థి నెట్‌బాల్ పోటీల్లో ఉమ్మడి జిల్లాలోనే ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడం హర్షణీయమన్నారు. ఈ నెల 23 నుంచి 25తేదీ వరకు మహబూబాబాద్‌లో జరి గే రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ అండర్ 17 పోటీలకు ఎంపిక అయ్యారని తెలిపారు. నెట్‌బాల్ పోటీలకు ఎంపికైన రామ్‌చరణ్‌ను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

దళితుల ఐక్యత కోసం మాలల మహా పాదయాత్ర

చేర్యాల, నవంబర్ 20 : ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా, దళితుల ఐక్యత కోసం జాతీయ మాలమహానాడు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ మహా పాదయాత్ర అక్టోబర్ 25న ప్రారంభించారని, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుట్టి సత్యనారాయణ వెల్లడించారు. పట్టణంలో బుధవారం ఆయన మాట్లాడుతూ మహాపాదయాత్ర రాత్రి జక్కాపూర్ చేరుకుంటుందని 21న జక్కాపూర్ నుంచి రామంచ మీదుగా సాగి రాత్రి సిద్దిపేటకు చేరుకుంటుందన్నారు. తెలంగాణ ఏర్పడిన నాటి నుంచి మూడెకరాల భూమి, దళితబంధు, డబుల్ బెడ్ రూమ్, కార్పొరేషన్ రుణాలు, గురుకుల సీట్లు ఎవరు ఎక్కువగా ఉపయోగించుకున్నారో శాస్త్రీయ ఆధారాలతో ప్రభుత్వం బయటపెట్టాలని డిమాండ్ చేశారు. పాదయాత్రకు అన్ని వర్గాల ప్రజలు హాజరుకావాలని కోరారు.

భారత్ బ్రాండ్ పథకాన్ని వెంటనే అమలు చేయాలి

హుస్నాబాద్, నవంబర్ 20 : కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన భారత్ బ్రాండ్ పథకాన్ని వెంటనే అమలు చేసి పేద, మధ్య తరగతి ప్రజలను ఆదుకోవాలని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి పచ్చిమట్ల రవీందర్‌గౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం హుస్నాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. నిత్యావసర ధరలు పెరుగుతున్న తరుణంలో ప్రజలకు భారత్ బ్రాండ్ పథకం ద్వారా సన్నబియ్యం, గోధుమపిండి తక్కువ ధరకే అందిస్తామని కేంద్ర మంత్రి ప్రహ్లాద్‌జోష్ ఇటీవల ప్రకటించారని, కానీ ఇప్పటివరకు ఆ పథకం ఊసెత్తడం లేదన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించి భారత్ బ్రాండ్ పథకాన్ని వెంటనే తెలంగాణలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీఎస్పీ నాయకులు సుధాకర్, శంకర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో కరాటే శిక్షణ తరగతులు

హుస్నాబాద్, నవంబర్ 20 : హుస్నాబాద్‌లోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు కరాటే శిక్షణా తరగతులు ప్రారంభమయ్యాయి. కరాటే మాస్టర్ కంటె రాజు ఆధ్వర్యంలో విద్యార్థులకు శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామని పాఠశాల హెచ్ఎం వాసుదేవరెడ్డి తెలిపారు. పాఠశాలలోని విద్యార్థులందరికీ ప్రతి రోజు కరాటే క్లాసులు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ సావుల శ్రీనివాస్, ఉపాధ్యాయులు సువర్ణలీల తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలి

రికార్డులు పరిశీలిస్తున్న కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్

దుబ్బాక, నవంబర్ 20 : సర్కార్ దవాఖానలో వైద్యులు అందుబాటులో ఉంటూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని తెలంగాణ వైద్యవిధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్ సూచించారు. బుధవారం దుబ్బాక వంద పడకల దవాఖానను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. దవాఖానలో రోగులకు అందుతున్న వైద్యసేవలు, వసతులను, రికార్డులను పరిశీలించారు. వైద్యుల పనితీరు మెరుగుపరుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సూపరిండెంటెండ్ హేమరాజ్‌సింగ్, వైద్యులు అరుణ తదితరులు ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణను అడ్డుకుంటాం..

సిద్దిపేట టౌన్,నవంబర్ 20 : మాల, మాల ఉపకులాలు అన్ని ఏకమై వర్గీకరణను అడ్డుకుంటామని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నేతలు కొదాది శ్రీనివాస్, గుడిమల్ల సత్తయ్య స్పష్టం చేశారు. ఎస్సీ,ఎస్టీ వర్గీకరణ రిజర్వేషన్ నిర్ణయాన్ని వెంటనే ఉపసరించుకోవాలని డిమాండ్ చేస్తూ డిసెంబర్ 1న తలపెట్టిన మాలల సింహగర్జన కరపత్రాన్ని బుధవారం సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో వారు ఆవిష్కరించారు. కార్యక్రమంలో న ర్సింగ్ రావు, విజయ్,దేవదాస్,కృష్ణ,శంకర్, మల్లేశం, యాదగిరి, అరుణ్‌కుమార్ వివిధ మండలాల నేతలు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి

కేంద్ర ప్రభుత్వం విద్యార్థి,నిరుద్యోగ కార్మిక కర్షక ప్రజా వ్యతిరేక విధానాలను అనుసరిస్తుందని రెవల్యూషనరీ సోషలిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి జానకీ రాములు ఆరోపించారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ తీరును నిరసిస్తూ ప్రజా విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 28న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మన్నె కుమార్, స్వామి, బాలకృష్ణ, శివ, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన నాయకుల ముందస్తు అరెస్టు

అక్కన్నపేట,నవంబర్ 20 : మండలంలోని వివిధ తండాలకు చెందిన గిరిజన నాయకులను బుధవారం ఉదయం అక్కన్నపేట పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. కొడంగల్ నియోజకవర్గంలోని లగచర్లలో గిరిజన రైతులపై అక్రమ కేసులు బనాయించి, అరెస్టు చేయడంపై నిరసిస్తూ అక్కడికి వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారనే సమాచారంతో పోలీసులు వారిని అరెస్టు చేసి, సాయంత్రం విడిచిపెట్టారు. గిరిజన నాయకులు నునావత్ మోహన్‌నాయక్, భూక్య కృష్ణనాయక్, సంతోష్‌నాయక్, సేవాలాల్‌నాయక్, శ్రీకాంత్‌నాయక్ తదితరులు ఉన్నారు.

ఉత్సవాలను విజయవంతం చేయాలి

కొండపాక(కుకునూరుపల్లి), నవంబర్ 20 : తెలంగాణ ముదిరాజ్ మహాసభ దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేద్దామని ముదిరాజ్ సంఘం కొండపాక మండలాధ్యక్షుడు జిర్ర రాజు, యువజన విభాగం అధ్యక్షుడు సున్నం భాస్కర్, మత్స్యశాఖ డైరెక్టర్ చిలుముల నరహరి ముదిరాజ్ కోరారు. బుధవారం కొండపాక మండలంలోని వెలికట్ట చౌరస్తాలో తెలంగాణ ముదిరాజ్ సంఘం దశాబ్ది ఉత్సవాల వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. నాయకులు మిద్దె శివకుమార్, నాగరాజు, స్వామి, దర్గయ్య, కనకయ్య, నర్సింహులు, ఉపేందర్, కాటకిష్టయ్య, అంకుష్, భాస్కర్ పాల్గొన్నారు.

గాంధీభవన్‌లో కాంగ్రెస్ జేఏసీ దీక్ష చేయాలి

చేర్యాలలో మాట్లాడుతున్న కొంగరి వెంకట్‌మావో

చేర్యాల, నవంబర్ 20 : కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జేఏసీ నిర్వహించే సంకల్పదీక్ష చేర్యాలలో కాకుండా గాంధీభవన్‌లో లేదా సచివాలయంలో చేస్తే ఈ ప్రాంత ప్రజలు నమ్ముతారని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కొంగరి వెంకట్‌మావో ఎద్దేవా చేశారు. పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో జరిగిన సమావేశంలో వెంకట్ మావో మాట్లాడారు. చేర్యాల రెవెన్యూ డివిజన్ కోసం ఈ ప్రాంత ప్రజలు పోరాటాలు చేస్తున్నా కొత్తగా ఏర్పాటైన కాంగ్రెస్ సర్కారు పట్టించుకోవడం లేదన్నారు. ప్రతిపక్ష పార్టీలతో ఏర్పాటు కావాల్సిన జేఏసీ అధికారంలో ఉన్న కాంగ్రెస్ నాయకులతో ఏర్పాటు చేసుకోవడం సిగ్గుచేటన్నారు. నవంబర్ 30న సంకల్ప దీక్షకు కాంగ్రెస్ జేఏసీ పిలుపునివ్వడం అర్థరహితమని, జేఏసీ ముసుగులో కాంగ్రెస్ నాయకులు చేస్తున్న కపట దీక్షలను ప్రజలు వ్యతిరేకించాలని కోరారు. నాయకులు బద్దిపడగ కృష్ణారెడ్డి, ఆలేటి యాదగిరి, చొప్పరి రవికుమార్, దాసరి ప్రశాంత్, నాలుగు మండలాల కార్యదర్శులు బండకింది అరుణ్ కుమార్, తాడూరి రవీందర్, ఎండి షఫీ, పోతిరెడ్డి రాజు, టౌన్ సెక్రటరీ రాళ్ల బండి నాగరాజు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞానాన్ని పెంపొందిస్తాయి



విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న ప్రిన్సిపాల్ నిఖిత్ అంజుమ్

గజ్వేల్, నవంబర్ 20 : గ్రంథాలయాలు విజ్ఞానాన్ని పెంపొందిస్తాయని అందుకు విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నిఖిత్ అంజుమ్ అన్నారు. గ్రంథాలయాల వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. గ్రంథాలయాల్లోని పుస్తకాలతో రచయితలు, కవులు ఎందరో మహనుభావుల జీవితచరిత్రను తెలుసుకునే అవకాశం ఉందన్నారు. విద్యార్థులకు నిర్వహించిన క్విజ్, పుస్తక ప్రదర్శన, పుస్తక సమీక్షలో ప్రతిభ చూపిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు వెంకటేశ్వర్లు, గణపతిరావు, వెంకటేశ్, మహేందర్‌రెడ్డి, రామచంద్రం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

సిద్దిపేట కలెక్టరేట్, నవంబర్ 20 : సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి సమీపంలోని సురభి మెడికల్ కళాశాలలో ప్రథమ సంవత్సరం చదువుతున్న హైదరాబాద్‌కు చెందిన విద్యార్థిని ఆత్మహత్యానికి పాల్పడిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. విషయం తెలుసుకున్న ఏసీపీ మధు, త్రీ టౌన్ సీఐ విద్యాసాగర్ బుధవారం కళాశాలను సందర్శించారు. వారు పరిశీలనలో తెలుసుకున్న వివరాలను మీడియాకు వివరించారు. ఏసీపీ, త్రీ టౌన్ సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ ప్రాంతానికి చెందిన విద్యార్థిని ఏడేండ్లుగా ఓసీడీ అనే వ్యాధితో బాధపడుతూ మందులు వాడుతున్నది. ఈ క్రమంలోనే మెడికల్‌లో సీటు రావడంతో సిద్దిపేట లోని సురభి మెడికల్ కళాశాలలో గత ఐదు రోజుల కింద చేరింది. తనకు కాలేజీలో చేరడం ఇష్టలేదు, ఎలాగైనా తల్లి దండ్రుల వద్దకు వెళ్లాలనే ఆలోచనతో శనివారం సూసైడ్ నోట్ రాసి ఆదివారం ఆత్మహత్యయత్నానికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. ఆదివారం ఉదయం హాస్టల్ భవనం రెండో అంతస్తు నుంచి కిందికి దూకిన విద్యార్థిని సహచర విద్యార్థులు, కళాశాల యాజమాన్యం గమనించి చికిత్స నిర్వహించి తల్లిదండ్రులను పిలిపించి అప్పజెప్పినట్లు తెలిపారు. ప్రస్తుతానికి విద్యార్థిని హైదరాబాద్‌లోని ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందుతుందని విద్యార్థిని ఆరోగ్యం నిలకడగా ఉందని విద్యార్థిని తల్లిదండ్రులతో మాట్లాడి పూర్తి వివరాలు తెలుసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ విషయమై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని వారు తెలిపారు.

నాచగిరిక్షేత్రంలో పార్థివలింగాకార దీపారాధన

క్షేత్రంలో పార్థివలింగాకార దీపారాధన

వర్గల్, నవంబర్ 20 : నాచగిరిశ్రీలక్ష్మీ నృసింహస్వామి దివ్యక్షేత్రంలో కార్తికమాసం పురస్కరించుకొని బుధవారం రాత్రి శివాలయ సన్నిధిలో పార్థివలింగాకార దీపారాధన జరిగింది. మహిళాభక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మహిళా రక్షణ చట్టాలపై అవగాహన

హుస్నాబాద్, నవంబర్ 20 : పట్టణంలోని కేరళ హైస్కూల్‌లో షీటీమ్ ఆధ్వర్యంలో మహిళా రక్షణ చట్టాలపై విద్యార్థులకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఎస్సై మణెమ్మ మాట్లాడుతూ మహిళల రక్షణకు అనేక చట్టాలు ఉన్నాయని, వీటిపై అందరూ అవగాహన కలిగి ఉండాలన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

మిరుదొడ్డి, నవంబర్ 20 : విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాల్లో నిలవాలని ఎక్సైజ్ శాఖ మిరుదొడ్డి సీఐ గాయత్రి అన్నారు. బుధవారం మిరుదొడ్డి మోడల్ స్కూల్‌లో పత్తు పదార్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

పశ్చిమ బెంగాల్ వాసి ఆత్మహత్య

కొండపాక(కుకునూరుపల్లి), నవంబర్ 20 : కుకునూరుపల్లి మండలంలోని లక్ష్మీ వెంకటేశ్వర రెడిమిక్స్ కంపెనీలో కూలీ మహనంద సర్దార్(24)కు ఇటీవల పెండ్లి సంబంధం కుదిరింది. ఇట్టి సంబంధానికి తండ్రి హరదాస్ సర్దార్ అడ్డు చెప్పడంతో మనస్తాపం చెందిన మహనంద సర్దార్ బుధవారం రెడిమిక్స్ ప్యాక్టరీ వెనుకల వ్యవసాయ క్షేత్రంలో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థిక సాయం

మిరుదొడ్డి, నవంబర్ 20 : మిరుదొడ్డి టౌన్‌లో ఇటీవల గుడ్డొల్ల బాలరాజు అనే యువకుడు మృతి చెందిన విషయం విదితమే. బుధవారం బీఆర్ఎస్ నాయకుడు తోట కమలాకర్ రెడ్డి మృతుడి కుటుంబాన్ని పరామర్శించి, రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట మండలాధ్యక్షుడు అంజిరెడ్డి, మాజీ సర్పంచ్ రాములు, మాజీ ఎంపీటీసీలు దారస్వామి, గొట్టం భైరయ్య, నాయకులు దార మల్లయ్య, ధర్మారం మల్లయ్య, కుమార్, సాయి కుమార్, నర్సింహులు, రాజు తదితరులు ఉన్నారు.

తొగుటలో..

తొగుట, నవంబర్ 20 : ఈ నెల 18న తొగుట మండల పరిధిలోని ఘనపూర్‌లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో బుచ్చల కనకవ్వ నివాస గుడిసే ఖాళీ బూడిదయ్యింది. బుధవారం డిప్యూటీ తహసీల్దార్ శ్రావణి పరామర్శించి, 50 కిలోల బియ్యం అందజేశారు. వెంట సిబ్బంది ఉన్నారు.

చేర్యాలలో..

చేర్యాల, నవంబర్ 20 : మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డుకు చెందిన తుమ్మలపల్లి సత్తయ్య ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. బాధిత కుటుంబానికి మాజీ కో-ఆప్షన్ సభ్యుడు ఎండీ ఖాజా బుధవారం పరామర్శించి, 50 కిలోల బియ్యం అందజేశారు. మాజీ జడ్పీటీసీ కొమ్ము నర్సింగరావు, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ కాటం మల్లేశం, నాయకులు ఒగ్గు మల్లేశం, దుర్గయ్య, తుమ్మలపల్లి శ్రీనివాస్, తాటిపాముల పరశురాములు, పచ్చిమడ్ల వెంకటయ్య, నవాజ్ తదితరులు ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

సిద్దిపేట, నవంబర్ 20 : సిద్దిపేట మున్సిపల్ పరిధిలోని సమగ్ర ఇంటింటి సర్వే దరఖాస్తులను ఆన్‌లైన్ చేసేందుకు ఆసక్తిగల యువకులు పురపాలక సంఘ కార్యాలయంలో సంప్రదించాలని మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ తెలిపారు. కంప్యూటర్ ఆపరేటింగ్‌పై అవగాహన ఉండి డాటా ఎంట్రీ సామర్థ్యం కలిగి ఉండాలన్నారు. ఇందు కోసం మున్సిపల్ కార్యాలయంలోని టౌన్ ప్లానింగ్ అధికారి శ్రీనివాస్ రెడ్డిని సంప్రదించి తమ పేరు నమోదు చేసుకోవాలన్నారు. ఒక్కో దరఖాస్తును ఆన్‌లైన్‌లో నమోదు చేసినందుకు రూ. 20 చెల్లించనున్నట్లు వెల్లడించారు.

పరామర్శ..

సభ్యులను పరామర్శిస్తున్న ఏఎంసీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్

గజ్వేల్, నవంబర్ 20 : మండల పరిధిలోని జాలిగామ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త గౌరి భిక్షపతి అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఏఎంసీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, నాయకులు మద్దూరి శ్రీనివాస్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి బుధవారం పరామర్శించారు.వెంట నాయకులు అశోక్‌రావు, రమేశ్ గౌడ్, శివయ్య, రాజేశ్వర్‌రెడ్డి, నరసింహులు గౌడ్, లక్ష్మణ్ ఉన్నారు.

చేర్యాలలో..

చేర్యాల, నవంబర్ 20 : మండలంలోని ముస్త్యాలలో వాకింగ్ చేస్తున్న సమయంలో బైక్ ఢీకొట్టిన ఘటనలో గాయపడిన జర్నలిస్టు కీసరి మల్లేశాన్ని బుధవారం స్థానిక జర్నలిస్టులు పరామర్శించారు. చేర్యాల, కొమురవెల్లి జర్నలిస్టులు ఉన్నారు.

పుస్తెమట్టెలు అందజేత

పుస్తెమట్టెలు అందజేస్తున్న చైర్మన్ బొంగు రాజేందర్‌రెడ్డి

కొమురవెల్లి, నవంబర్ 20 : మండలంలోని గురువన్నపేటలో నిరుపేద కుటుంబానికి చెందిన గాజె లక్ష్మి-యాదగిరి దంపతుల కుమార్తె వివాహం బుధవారం వారి స్వగృహంలో జరిగింది. ఈ వివాహానికి బీఆర్ఎస్ జిల్లా నాయకుడు, బీఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ బొంగు రాజేందర్‌రెడ్డి హాజరై వధువు అనూషకు పుస్తెమట్టెలు అందజేశారు. మాజీ ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షుడు సాయిమల్లు, బీఆర్ఎస్ నాయకులు బుడిగె గురువయ్య గౌడ్, గ్రామశాఖ అధ్యక్షుడు బచ్చల పరశురాములు, సోషల్ మీడియా మండల కో-ఆర్డినేటర్ బుడిగె రమేశ్ గౌడ్, మైనార్టీ మండలాధ్యక్షుడు ఎండీ.అర్షద్, మాజీ ఉపసర్పంచ్ తుక్కొజి నర్సింహులు, బుడిగె రమేశ్‌గౌడ్, మకిలి నవీన్, సాయి పాల్గొన్నారు.

ఓటరు నమోదును సద్వినియోగం చేసుకోవాలి

మద్దూరు(ధూళిమిట్ట), నవంబర్ 20 : ఓటరు నమోదు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని మద్దూరు తహసీల్దార్ మహ్మద్ ఏజీ రహీం కోరారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 18 ఏండ్లు నిండి ఓటు హక్కులేని వాళ్లు ఓటు హక్కు కోసం ఆన్‌లైన్‌లో లేదా గ్రామాల్లో బీఎల్‌వోల వద్ద నమోదు చేసుకోవాలన్నారు. ఈ నెల 23, 24వ తేదీల్లో ఓటరు నమోదుకు స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. 28వ తేదీ వరకు ఓటరు నమోదు కొనసాగనున్నట్లు వివరించారు.